TGTEL/25/A1132

మానవాళికి

# జనం వార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..

ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు



'జనం వార్త'
మీ వ్యాపార, ఉద్యోగ, రాజకీయ, వివాహ, జన్మదిన తదితర ప్రకటనల కోసం సంప్రదించండి...
సెల్ : 8522 055 889

మేడ్చల్ | సోమవారం | 15.12.2025 | సంపుటి : 1 | సంచిక : 170 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్



### ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ

# సహించే ప్రసక్తే లేదు

**ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ పూర్తి మద్దతిస్తుంది**

**సాధారణ పౌరుల్ని లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరపడం హేయం**

**సిడ్నీ నగరంలో ఉగ్ర కాల్పుల ఘటనపై ప్రధాని మోదీ స్పందన**

**ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించే ప్రసక్తే లేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటానికి భారత్ పూర్తి మద్దతిస్తుందని పునరుద్ఘాటించారు. ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరం బాండి బీచ్‌లో ఉగ్ర కాల్పుల ఘటనపై ప్రధాని స్పందించారు. సాధారణ పౌరుల్ని లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరపడం హేయమైన చర్య అని అన్నారు.**

న్యూఢిల్లీ: ఈ ఉగ్ర ఘటన తనను షాక్‌కు గురిచేసిందన్నారు. ఆత్మీయులను కోల్పోయిన వారికి భారత ప్రజల తరపున ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ దుఃఖ సమయంలో ఆస్ట్రేలియాకు భారత్ మద్దతుగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. మరోవైపు భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ కూడా సిడ్నీ ఘటనను తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తమ ఆలోచలన్నీ ఆప్తులను కోల్పోయిన వారిచుట్టూనే ఉన్నాయంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో ప్రముఖ పర్యాటక ప్రదేశమైన

-మిగతా 2 లో..

# రెండో విడతలో 85.86% ఓటింగ్

## తొలి విడత కంటే 1.58% ఎక్కువ

**టాప్‌లో యాదాద్రి భువనగిరి.. లాస్ట్‌లో నిజామాబాద్**

**ఏకగ్రీవాలు మినహా మొత్తం 7,745 పంచాయతీలకు ముగిసిన ఎన్నికలు**

**17న చివరి దఫాలో 3,759 పంచాయతీలకు పోలింగ్**

**రెండో దఫా పంచాయతీ ఎన్నికల్లో మరింత భారీగా పోలింగ్ నమోదైంది. తొలివిడత ఎన్నికల్లో 84.28 శాతం పోలింగ్‌నమోదు కాగా.. రెండో విడతలో 1.58 శాతం ఎక్కువగా 85.86% ఓటింగ్ నమోదైనట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ప్రకటించింది. మొత్తం మీద రెండో విడత పంచాయతీ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచే పోలింగ్‌కేంద్రా ల వద్ద ఓటర్లు బారులు తీరారు.**





### రెండో విడతలోనూ

# కాంగ్రెస్‌దే..

**రెండో విడత ఫలితాలు ఇలా..**

| | |
|---|---|
| కాంగ్రెస్ | 2,067 |
| బీఆర్ఎస్ | 1,160 |
| బీజేపీ | 250 |
| ఇతరులు | 429 |

**55% స్థానాల్లో అధికార పార్టీ మద్దతిచ్చిన అభ్యర్థులదే విజయం**

**బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థుల్లో 29% మంది గెలుపు.. తర్వాతి స్థానంలో బీజేపీ**

**సత్తా చాటుతున్న స్వతంత్రులు..**

హైదరాబాద్: రెండో విడత పంచాయతీ ఎన్నికల్లోనూ దాదాపుగా తొలి విడత ఫలితాలే పునరావృతమయ్యాయి. మొదటి విడత తరహాలోనే రాష్ట్ర వ్యాప్తంగా మెజార్టీ స్థానాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులే విజయం

-మిగతా 2 లో..

### రాజ్యాంగాన్ని రద్దు చేయాలని

# బీజేపీ చూస్తోంది

**ఓట్ల చోరీ ఒక్క కాంగ్రెస్ సమస్యే కాదు.. దేశ సమస్య**

**తొలుత ఓట్లు తర్వాత ఆధార్, భూమి, ఆస్తులు కూడా..**

**రాహుల్ వల్లే రాజ్యాంగం, రిజర్వేషన్లు ఇంకా ఉన్నాయి**

**'ఓట్ చోర్-గద్దీ ఛోడ్' సభలో సీఎం రేవంత్‌రెడ్డి**



రాజ్యాంగాన్ని రద్దు చేయాలని భాజపా చూస్తోందని, కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. 'ఓట్ చోర్-గద్దీ ఛోడ్' పేరు దిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ మహా ధర్నా నిర్వహించింది. ఈ కార్యక్రామానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు పలువురు ముఖ్య నేతలు హాజరయ్యారు.

-మిగతా 2 లో..



### ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో

# ఆర్టీసీని ప్రైవేటు పరం

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**

హైదరాబాద్: ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ఆర్టీసీని ప్రైవేటు పరం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. ఆదివారం బషీర్ బాగ్

-మిగతా 2 లో..

# త్వరలో మంత్రివర్గ ప్రక్షాళన

**నెల రోజుల్లో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకం**

**బీఆర్ఎస్ కథ ముగిసిపోయింది**

**బీజేపీకి రాష్టంలో అనుకూలమైన వాతావరణం ఎప్పుడూ లేదు**

**మీడియాచిట్‌చాట్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్**



న్యూఢిల్లీ: త్వరలోనే రాష్ట్ర మంత్రివర్గ ప్రక్షాళన ఉంటుందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,అధిష్టానం మధ్య ఏకాభిప్రాయం కుదరాల్సిందనని చెప్పారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, కార్యదర్శులతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ కమిటీలను నెలరోజుల్లో భర్తీ చేస్తామన్నారు.

మంత్రివర్గం నుంచి పొన్నం ప్రభాకర్, సురేఖను తొలగిస్తారనే ప్రచారంలో వాస్తవం లేదని, వాళ్లిద్దరూ కాంగ్రెస్ నేతలే అని వ్యాఖ్యానించారు. ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ నిర్వహించిన 'ఓట్ చోర్-గద్దీ ఛోడ్'మహాధర్నాలో

-మిగతా 2 లో..



## సైబర్ క్రైమ్ గుట్టురట్టు

**111 డొల్ల కంపెనీలను గుర్తించిన సీబీఐ**

దిల్లీ: నకిలీ సంస్థలు, డిజిటల్ స్కాముల ద్వారా రూ.వెయ్యి కోట్లకుపైగా మోసాలకు పాల్పడిన ఓ అంతర్జాతీయ సైబర్ ముఠా

-మిగతా 2 లో..

# జలదోపిడీపై ప్రజా ఉద్యమం

**19న కేసీఆర్ అధ్యక్షతన జరిగే విస్తృతస్థాయి సమావేశంలో కార్యాచరణ**

**నదీ జలాల పరిరక్షణలో కాంగ్రెస్ విఫలమైందని విమర్శలు**

**ఏపీకి కేంద్రం సహకరిస్తోందని మండిపాటు**

హైదరాబాద్: గోదావరి, కృష్ణా జలాల్లో ఏపీ జలదోపిడీపై పోరుబాట పట్టాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్మాణం, నదీ జలాల కేటాయింపు వంటి అంశాలపైనా ఉద్యమించాలని పార్టీ భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఉద్యమ

-మిగతా 2 లో..



### ప్రేమపెళ్లి కాపురంలో

# అదనపు కట్నం చిచ్చు

**చనిపోయిన మహిళ నోట్లో పురుగుల మందు**

**ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నం**

**ఆగ్రహంతో భర్తకు దేహశుద్ధి చేసిన స్థానికులు**

**పరారీలో అత్తామామ, మరిది**

మహబూబాబాద్ : ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను కొంతకాలానికే ఆమె భర్త, అత్తింటివారు వేధించారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ఓర్చుకొంది. ఆమె సహనాన్ని ఆసరా చేసుకొని భర్త, అత్త, మామ, మరిది

-మిగతా 2 లో..



జనం వార్త



# త్వరలో మంత్రివర్గ ప్రక్షాళన

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొనేందుకు మహేశ్ గౌడ్ వచ్చారు. ఈసందర్భంగా ఆయన తెంగాణభవన్‌లో విలేకరులతో చిట్‌చాట్ చేశారు. 'తెలంగాణలో ప్రభుత్వ ఏర్పాటు సమయంలోనే నన్ను మంత్రివర్గంలోకి ఆహ్వానించారు. స్వయంగా కేసీ వేణుగోపాల్ ప్రతిపాదన పెట్టారు. కానీ, నాకు మంత్రి పదవిపై మక్కువ లేదని చెప్పాను'అని అన్నారు. మహేశ్‌గౌడ్ ఇంకా ఏమన్నారంటే..

### వేదికపైకి మంత్రులను పిలిస్తే బాగుండేది..

గ్లోబల్ సమ్మిట్‌లో రాజకీయ ప్రాధాన్యత ఉండొద్దనే ఉద్దేశంతోనే మంత్రులను స్టేజీ మీదకు ఆహ్వానించలేదు. అయితే, మంత్రులను కూడా వేదికపైకి పిలిస్తే బాగుండేది. కొందరు ఐఏఎస్ అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారు. రాహుల్ గాంధీ గ్లోబల్ సమ్మిట్‌కు కూడా వస్తే బాగుండేది. గ్లోబల్ సమ్మిట్ ప్రతిఏటా పెడితే ఎలా ఉంటుందనేది ఆలోచిస్తున్నాం. బీసీ ప్రైవేట్ బిల్లు పార్లమెంటులో పెడితే బాగుంటుందని రాహుల్ గాన్యదీకి చెప్పాం. డీసీసీ అధ్యక్షుల ఎంపిక పారదర్శకంగా జరిగింది. రంగారెడ్డి, సంగారెడ్డి డీసీసీ పదవులనూ తొలివిడతలోనే భర్తీ చేయాలి. కానీ, అక్కడ వచ్చిన దరఖాస్తులు, క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోలలేదు. అందుకే ఆ రెండింటిని పెండింగ్‌లో ఉంచాం.

### జనం కవిత మాటలు నమ్ముతున్నారు...

బీఆర్ఎస్ కథ ముగిసిపోయింది. పదేళ్ల బీఆర్ఎస్ అవినీతిని కవిత దగ్గర నుంచి చూసింది కాబట్టే.. ఆమె మాటలను ప్రజలు అంగీకరిస్తున్నారు. ప్రాంతీయ పార్టీలు అధికారంలో లేకుండా మనుగడ సాధించడం అంత సులభం కాదు. కేసీఆర్ ఇమేజ్ కేటీఆర్‌కు రాలేదు. హరీశ్‌రావు దెబ్బకొట్టడం ఖాయం. డబ్బులతో కేటీఆర్ సోషల్ మీడియాను మేనేజ్ చేస్తున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఏం జరుగుతుందో కేసీఆర్ ముందే ఊహించారు.. అందుకే ప్రచారానికి రాలేదు'

### బీజేపీ ఎమ్మెల్యేలు పక్కచూపులు చూస్తున్నారు

బీజేపీకి అనుకూలమైన వాతావరణం తెలంగాణలో ఏమాత్రం లేదు. బీజేపీ అధిష్టానానికీ ఆ విషయం తెలుసు. బీజేపీకి 60-70 స్థానాల్లో కనీసం కేడరే లేదు. బీజేపీ ఎమ్మెల్యేలు పక్కచూపులు చూస్తు న్నారు. కానీ మేమే కొన్ని విలువలు పాటిస్తున్నాం. కాబట్టే.. అవకాశం ఇవ్వడం లేదు. మళ్లీ ప్రభుత్వం రావడం అనేది మాకు నల్లేరు మీద నడకే.

### ఇన్వెస్టర్ల చూపు హైదరాబాద్ వైపే...

రేవంత్ రెడ్డి విజనరీ ఉన్న లీడర్. ఫోర్త్ సిటీ పూర్తయితే దేశంలోని మరే నగరం హైదరాబాద్‌తో తట్టుకోలేదు. కంపెనీలకు అన్ని రకాలుగా అనుకూలమైన పాలసీలు రూపొందించాం. టెస్లాను హైదరాబాద్‌కు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. ఈ విషయంలో సహకరించాలని రాహుల్ గాన్యదీని కోరాం. చంద్రబాబు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఇన్వెస్టర్లు మాత్రం హైదరాబాద్ వైపే చూస్తున్నారు. హైదరాబాద్‌లోని ఏ పెద్ద వెంచర్‌లోకి వెళ్లినా పుణే, చెన్నై, ముంబై, బెంగళూరుకు చెందిన వాళ్లే కొనుగోలు చేస్తున్నారు. ఎక్కువశాతం వెంచర్లలో 25 నుంచి 30 శాతం మహారాష్ట్ర వాళ్లే కొనుగోలు చేస్తున్నారు. రాబోయే మూడేళ్లలో హైదరాబాద్ ఇండియాలోనే నంబర్ వన్ నగరంగా మారబోతోంది.



# ఖరీఫ్ ధాన్యం సేకరణ లక్ష్యం పెంచండి

## కేంద్రానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ

**హైదరాబాద్:** 'తెలంగాణలో ఖరీఫ్ వరి ధాన్యం సేకరణకు కేంద్రం కేటాయించిన లక్ష్యం 54 లక్షల టన్నుల్లో ఇప్పటికే 52 లక్షల టన్నులు సేకరించాం. ఇంకో రెండు రోజుల్లోనే లక్ష్యానికి చేరుకుంటాం. ఈలోగా లక్ష్యాన్ని పెంచకపోతే కొనుగోళ్లు నిలిచిపోతాయి. రైతులు తక్కువ ధరకే ధాన్యాన్ని అమ్ముకునే పరిస్థితి వస్తుంది. వారికి నష్టం జరగకుండా ఉండేందుకు లక్ష్యాన్ని 80 లక్షల టన్నులకు వెంటనే పెంచండి' అంటూ కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం లేఖ రాశారు. లేఖలోని ముఖ్యాంశాలిలా... 2024-25 రబీ సీజన్‌లో కేంద్రం సుమారు 35 లక్షల టన్నుల బియ్యం సేకరణ లక్ష్యం కేటాయించగా- ఎఫ్‌సీఐకి 17.83 లక్షల టన్నుల బాయిల్డ్ బియ్యం, 1.13 లక్షల టన్నుల ముడి బియ్యం సరఫరా చేశాం. ఇంకా 1.56 లక్షల టన్నుల బాయిల్డ్ బియ్యం, 14.01 లక్షల టన్నుల ముడి బియ్యం పెండింగ్‌లో ఉన్నాయి. సీఎంఆర్ సరఫరా సకాలంలో పూర్తయ్యేందుకు అదనంగా 10 లక్షల టన్నుల బాయిల్డ్ బియ్యం లక్ష్యాన్ని కేటాయించాలి. 2025-26 ఖరీఫ్ సీజన్‌కు 36 లక్షల టన్నుల బియ్యం (54 లక్షల టన్నుల ధాన్యం) కొనుగోలు లక్ష్యాన్ని కేంద్రం నిర్ణయించింది. తెలంగాణలో ధాన్యం ఉత్పత్తి అంచనా 148 లక్షల టన్నులు. దీనికి అనుగుణంగా లక్ష్యాన్ని 80 లక్షల టన్నులకు పెంచాలి. 2024-25 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ సరఫరా గడువు 12.11.2025తో ముగిసింది. మిల్లర్ల దగ్గర 3.50 లక్షల టన్నుల ధాన్యం నిలిచిపోయినట్లు తనిఖీల్లో గుర్తించాం. గడువును జనవరి 31 వరకు పొడిగించాలి. రాష్ట్రంలోని రైలు ర్యాక్‌ల సామర్థ్యం 13.5 లక్షల టన్నులు. ఫలితంగా రాష్ట్రంలోని ఎఫ్‌సీఐ గోదాములు బియ్యం నిల్వలతో నిండిపోయాయి. దీంతో సీఎంఆర్ సరఫరాలో జాప్యంతో పాటు కొత్తగా కొన్న ధాన్యం నిల్వకు స్థలం దొరకట్లేదు. రాష్ట్రానికి అదనపు రైలు ర్యాక్‌లను కేటాయించాలి. ప్రస్తుతం తెలంగాణలోని గోదాముల నిల్వ సామర్థ్యం సుమారు 65 లక్షల టన్నులే. మరో 15 లక్షల టన్నుల సామర్థ్యం పెంచాలి. 2014-15 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రూ.1,468 కోట్ల విలువైన లెవీ బియ్యానికి సంబంధించిన సబ్సిడీ నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటితోపాటు 2022 ఏప్రిల్‌లో పంపిణీ చేసిన 89,988 టన్నుల బియ్యానికి సంబంధించిన రూ.343.27 కోట్ల సబ్సిడీ నిధులను వెంటనే విడుదల చేయాలి.

# రాజ్యాంగాన్ని రద్దు చేయాలని బీజేపీ చూస్తోంది

**న్యూఢిల్లీ:** 'ఓట్ చోరీ అనే అంశం ఒక్క కాంగ్రెస్ పార్టీ సమస్యే కాదు.. ఇది మొత్తం దేశం సమస్య..'అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. లోక్‌సభలో ఓట్ చోరీపై జరుగుతున్న యుద్ధంలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి మనమంతా అండగా ఉండాలని పిలుపునిచ్చారు. రాహుల్‌గాంధీ ఒక సిపాయిలా మోదీకి వ్యతిరేకంగా పోరాడాలని, తెలంగాణ నుంచి తాము వెన్నంటి ఉంటామని చెప్పారు. ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో 'ఓట్ చోర్-గద్దీ ఛోడ్'పేరుతో కాంగ్రెస్ పార్టీ మహాధర్నా నిర్వహించింది. కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియాగాన్యదీ, రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంకా గాంధీ తదితరులు పాల్గొన్న సభలో రేవంత్ రెడ్డి మాట్లాడారు.

### ఆ యుద్ధంలో రాహుల్‌ను గెలిపించాలి

'దేశ ప్రజల రాజ్యాంగ హక్కు కోసం చేస్తున్న యుద్ధంలో రాహుల్‌ను దేశ ప్రజలు గెలిపించాలి. లేదంటే ఓటు హక్కును లాక్కుంటారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో ముందుగా ఓటరు లిస్టు నుంచి పేరు తొలగిస్తారు. ఆ తర్వాత ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, భూమి, ఆస్తులు కూడా లాక్కుంటారు. రాజ్యాంగాన్ని రూపొందించే సమయంలో చట్ట సభలో విస్తృతంగా చర్చ జరిగింది. దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, నిరుపేదలకు ఓటు హక్కు కల్పించాలని మహాత్మాగాన్యదీ, డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ కోరారు. కానీ ఆర్ఎస్ఎస్, ఆర్ఎస్ఎస్ సిద్ధాంత కర్త ఎం.ఎస్ గోల్‌వాల్కర్ తదితరులు ఈ వర్గాలకు ఓటు హక్కును నిరాకరించారు. కానీ మహాత్మాగాంధీ, అంబేడ్కర్ పేదలకు ఓటు హక్కు కల్పించి దేశంలో ప్రభుత్వ ఏర్పాటులో వారికి అవకాశం ఇచ్చారు..'అని సీఎం చెప్పారు.

### రాహుల్ ముందే హెచ్చరించారు..

'ఆర్ఎస్ఎస్ భావజాలం, ఆలోచనా విధానంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మోదీ, అమిత్‌షా గత పార్లమెంటు ఎన్నికల్లో 400 సీట్లు ఇవ్వాలంటూ ఓటర్లను అడిగారు. బీజేపీకి 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని, రిజర్వేషన్లను రద్దు చేస్తారని రాహుల్‌గాంధీ అప్పుడు చెప్పారు. అందుకే దేశ ప్రజలు బీజేపీకి 240 సీట్లతోనే సరిపెట్టారు. కాబట్టే రాజ్యాంగం రక్షించబడింది. ఇవాళ రాజ్యాంగం, రిజర్వేషన్లు ఉన్నాయంటే వారికి 400 సీట్లు రాలేదు కాబట్టే. వారు ఎస్ఐఆర్ పేరిట ఓట్ చోరీ చేస్తున్నారు. దళిత, ఆదివాసీ, మైనారిటీ, నిరుపేదల ఓట్లు తొలగించే పనిలో పడ్డారు. గతంలో దళిత, ఆదివాసీ, మైనారిటీ, నిరుపేదలకు జరుగుతున్న అన్యాయానికి వ్య తిరేకంగా మహాత్మాగాంధీ, అంబేడ్కర్ నిలబడ్డారు. ఇప్పుడు రాహుల్, ఖర్గే ఈ వర్గాలకు మద్దతుగా, మోదీ, అమిత్ షాలకు వ్యతిరేకంగా.. ఆర్ఎస్ఎస్, గోల్వార్కర్ ఆలోచనా విధానానికి వ్యతిరేకంగా రామ్‌లీలా మైదానంలో మీ ముందు ఉన్నారు. ఈ యుద్ధంలో మనమంతా రాహుల్‌గాంధీకి మద్దతుగా నిలవాలి..'అని సీఎం పిలుపునిచ్చారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీపీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు మల్లురవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్ తదితరులు కూడాధర్నాలో పాల్గొన్నారు.

# రెండో విడతలో 85.86% ఓటింగ్

(మొదటిపేజీ తరువాయి)

మధ్యాహ్నం ఒంటి గంటకు పోలింగ్‌ముగియగా, ఆలోపు క్యూలైన్‌లో ఉన్నవారిని ఓటేసేందుకు అనుమతించారు. పోలింగ్‌ముగిశాక కౌంటింగ్‌ప్రారంభించి విజేతలను ప్రకటించారు. ఏకగ్రీవాలను మినహాయిస్తే రెండు విడతల్లో కలిపి 7,745 పంచాయతీలకు ఎన్నికలు ముగియగా, మూడో దఫాలో భాగంగా ఈ నెల 17న మరో 3,759 పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. రెండో దఫాలో 3,911 పంచాయతీలకు, 29,917 వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికలు జరగగా.. మొత్తం 54,40,339 మంది ఓటర్లకు గాను 46,70,972 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 91.72%, ఖమ్మం జిల్లాలో 91.21% పోలింగ్ నమోదు అయ్యింది. అత్యల్పంగా నిజామాబాద్‌జిల్లాలో 76.71%, జగిత్యాలలో 78.34% ఓటింగ్ నమోదైంది. పురుషుల కంటే మహిళా ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్ పాల్గొన్నారు. ఈ విడతలో మొత్తం 4,333 పంచాయతీలకు నోటిఫికేషన్ ఇవ్వగా.. 5 పంచాయతీలు, 108 వార్డుల్లో నామినేషన్లు దాఖలు కాలేదు. ఇక మరో 416 పంచాయతీల్లో సర్పంచ్, అలాగే 8,307 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. కోర్టు కేసులు, ఇతర కారణాల వల్ల 2 పంచాయతీలు, 18 వార్డుల్లో ఎన్నికలు నిలిచిపోయాయి. దీంతో మిగిలిన 3,911 సర్పంచ్, 29,917 వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికలు జరిగాయి.

### యాదాద్రి జిల్లా టాప్

రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓటేయడానికి పట్నం ప్రజలు పల్లె బాట పట్టారు. పెద్ద ఎత్తున సొంతూళ్లకు తరలివచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ సరళిని పరిశీలిస్తే ఈసారి 54,40,339 ఓటర్లు ఉండగా.. 46,70,972 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో మహిళా ఓటర్లు 27,82,494 ఓటర్లు ఉండగా.. పురుష ఓటర్లు 22,77,902 మంది ఓటేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా 2,02,716 మంది ఓటర్లకు గాను..1,8,5937 మంది ఓటింగ్‌తో (91.72 శాతం)తో అగ్రస్థానంలో నిలిచింది. నిజామాబాద్ జిల్లాలో మొత్తం 2,38,838 ఓటర్లు ఉండగా.. 1,83,219 మంది ఓటింగ్ (76.71 శాతం)తో చివరి స్థానంలో నిలిచింది. ఖమ్మం జిల్లాలో 91.21%, సూర్యాపేట జిల్లాలో 89.55%, మెదక్88.74%,



నల్లగొండ జిల్లాలో 88.74% నమోదు కాగా.. జగిత్యాల (78.34%), భద్రాద్రి కొత్తగూడెం (82.65%), నిర్మల్ (82.67%), వికారాబాద్ (82.72%)లో వరుసగా అత్యల్ప ఓటింగ్ నమోదైంది.

తగ్గిన పోస్టల్ బ్యాలెట్లు: పోలింగ్ ముగిసిన తర్వాత మ ధ్యాహ్నం 2 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యింది. తొలుత పోస్టల్ బ్యాలెట్లను లెక్కించారు. గతంతో పోలి స్తే ఈసారి పోస్టల్‌బ్యాలెట్‌ఓట్లు భారీగా తగ్గినట్లు అధికారు లు పేర్కొన్నారు. కాగా వార్డుల వారీగా ఫలితాలను వెల్లడించారు. గెలుపొందిన సర్పంచ్, వార్డు మెంబర్లు ప్రత్యేకంగా సమావేశమై ఉప సర్పంచ్‌లను ఎన్నుకున్నారు. రెండో విడత ఎన్నికలు మొత్తం మీద ప్రశాంతంగా ముగిశాయి.

### పోటెత్తిన మహిళలు

ఈ విడతలో మొత్తం మహిళా ఓటర్లు 27,82,494 మంది ఉండగా.. 23,93,010 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పలు జిల్లాల్లో మహిళలు పెద్దఎత్తున ఓటింగ్‌లో పాల్గొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 91.62%, ఖమ్మం 90.88%, మెదక్ 89.28% అత్యధికంగా ఓటింగ్ నమోదు కాగా.. భద్రాద్రి కొత్తగూడెం 81.38%, వికారాబాద్ 81.79%, ములుగు 82.79% ఓటింగ్ నమోదైంది. పురుషుల ఓటింగ్ శాతంలో కూడా యాదాద్రి (91.83%), ఖమ్మం (91.56%) జిల్లాలే ముందంజలో ఉన్నాయి.

## రెండో విడతలోనూ కాంగ్రెస్‌దే..


(మొదటిపేజీ తరువాయి)

సాధించారు. ఆదివారం రాష్ట్రంలోని 3,911 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించగా.. కాంగ్రెస్ మద్దతు పలికిన అభ్యర్థులు 2,067 మంది గెలుపొందారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు 1,160 స్థానాలు గెలుపొందగా, బీజేపీ బలపర్చిన అభ్యర్థులు 250 మంది గెలిచారు. మరోవైపు స్వతంత్రులు, సీపీఎం, సీపీఐ పార్టీలకు చెందిన వారు.. 429 మంది గెలుపొందారు. వీరు మొత్తం స్థానాల్లో 11 శాతానికి పైగానే గెలుపొందడం విశేషం. ఇక రెండు విడతల్లో కలిపి కాంగ్రెస్ బలపర్చగా గెలిచిన వారి సంఖ్య 4,500 దాటింది. బీఆర్ఎస్ బలపర్చిన 2,300 మంది విజయం సాధించగా, బీజేపీ బలపర్చిన వారు 440 మంది వరకు గెలుపొందినట్లు గణాంకాలు చెబుతున్నాయి. రెండో విడతకు సంబంధించి 416 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో మాదిరిగానే రెండో విడతలో కూడా 55 శాతం వరకు పంచాయతీలు కాంగ్రెస్ బలపర్చిన వారికే దక్కగా, అదే సమయంలో బీఆర్ఎస్ సైతం మంచి పోటీ ఇచ్చింది. ఆ పార్టీకి 29 శాతం కంటే ఎక్కువగా పంచాయతీలు దక్కాయి. బీజేపీ మద్దతిచ్చిన వారు 6 శాతానికి పైగా విజయం సాధించారు.

# ప్రేమపెళ్లి కాపురంలో అదనపు కట్నం చిచ్చు

(మొదటిపేజీ తరువాయి)

కలిసి కొట్టి చంపి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారు.. ఈ సంఘటన మహబూబాబాద్ మండలం కొమ్ముగూడెం తండాలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... కొమ్ముగూడెంతండాకు చెందిన గుగులోతు అర్జున్-కౌసల్య దంపతుల కుమార్తె బానోతు స్వప్న(30), అదే తండాకు చెందిన బానోతు కిషన్, బుజ్జీల కుమారుడు రామన్న 15 ఏళ్ల కిందట ప్రేమించుకొని పెద్దలను ఒప్పించి వివాహం చేసుకొన్నారు. పెళ్లి సమయంలో రూ.మూడు లక్షల కట్నం కూడా ఇచ్చారు. వారికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కొంతకాలానికి అదనపు కట్నం కావాలంటూ వేధించడంతో అర్జున్ ఎకరం భూమిని కూడా ఇచ్చారు. ఇక నుంచి ఇబ్బందులకు గురి చేయబోమని పెద్ద మనుషుల సమక్షంలో అంగీకార పత్రం రాసిచ్చారు. భర్త రామన్న, అత్తమామలు కిషన్, బుజ్జీ, మరిది నవీన్ ఇటీవల తరచూ ఆమెను కొడుతూ ఇబ్బందులకు గురి చేసేవారు. మూడ్రోజుల కిందట అదనపు కట్నం తేవాలని, ఇంటి విషయాలను బయటి వారికి చెప్పొద్దంటూ వేధించి ఆమెను రేకుల గదిలో ఉంచారు. శనివారం రాత్రి నలుగురు కలిసి స్వప్నను తీవ్రంగా కొట్టి హత్య చేశారు. అనుమానం రాకుండా ఉండేందుకు ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు నటించి మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. పురుగుల మందు ఆమె నోట్లో పోసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారు. తమ కూతుర్ని కొట్టి చంపారని



ఆగ్రహంతో మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు ఇంట్లో ఉన్న సామగ్రిని ధ్వంసం చేశారు. రామన్నను స్థానికులు కొట్టగా, అతని తల్లిదండ్రులు, సోదరుడు పరారయ్యారు. మృతురాలి తండ్రి అర్జున్ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసును విచారిస్తామన్నారు. రామన్న- స్వప్నలకు ముగ్గురు సంతానం. పెద్ద కుమార్తె సంజన దివ్యాంగురాలు, చిన్న కూతురు దక్షిత, ఏడాది వయసు గల అభిరాజ్ ఉన్నారు. తీవ్రగాయాలతో ఏడ్చినా వదలకుండా అమ్మను కొట్టారని నాలుగేళ్ల దక్షిత చెప్పిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది.

## ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించే ప్రసక్తే లేదు

(మొదటిపేజీ తరువాయి)

బాండి బీచ్‌లో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో 11 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. మరో 16 మంది తీవ్రంగా గాయపడి వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు అక్కడి మీడియా వెల్లడించింది. ఇద్దరు సాయుధులైన దుండగులు విచక్షణా రహితంగా కాల్పులు జరపడంతో.. ఒక్కసారిగా అక్కడ భీతావహ పరిస్థితులు ఏర్పడ్డాయి. వందలాది మంది పర్యాటకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరుగులు తీశారు.



## ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ఆర్టీసీని ప్రైవేటు పరం

(మొదటిపేజీ తరువాయి)

ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆమె మాట్లాడారు. "హైదరాబాద్ మహానగరంలో కోటి మంది పైచిలుకు ప్రజలు నివాసం ఉంటున్నారు. నగరంలో 7500 వరకు ఉండే ఆర్టీసీ బస్సులను.. ఉచిత బస్సు ప్రయాణం వచ్చాక 3500కు తగ్గించారు. దీంతో ప్రయాణించాలంటే ప్రజలకు చాలా ఇబ్బందిగా మారింది. ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ఆర్టీసీను ప్రైవేటు పరం చేసే ప్రయత్నం చేస్తున్నారు. రవాణా వ్యవస్థ సరిగా లేనప్పుడు హైదరాబాద్ విశ్వనగరం ఎలా అవుతుంది?అక్టోబర్ 25 నుంచి జాగృతి జనంబాట కార్యక్రమం కొనసాగుతుంది. ప్రతి జిల్లాలో రెండ్రోజులు ఉండి అక్కడి సమస్యలను తెలుసుకుంటున్నా. 15 రోజుల పాటు పంచాయతీ ఎన్నికలు ఉన్నాయి కాబట్టి ఎన్నికల కోడ్ లేని జిల్లాల్లో పర్యటించా. హైదరాబాద్‌లో వీధికుక్కలు కరవటం ప్రధాన సమస్యగా మారింది. సిటిజన్ పోలీసింగ్ ఉంటే బాగుంటుంది. పారిశుద్ధ్య కార్మికుల కొరత ఉంది.. ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతోంది. సీతాఫల్ మండి గవర్నమెంట్ స్కూల్ దగ్గర అసాంఘిక కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. త్వరలోనే స్కూల్ నిర్మాణ పనులను పూర్తి చేయాలి. అంబర్ పేట- ముసరాంబాగ్ బ్రిడ్జ్ నిర్మాణం త్వరిత గతిన పూర్తి చేయాలి. కొండపోచమ్మ సాగర్ నుంచి హైదరాబాద్‌కు తాగునీరు అందించాలి. అర్బన్‌లో కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి. జనం బాటలో అనేక విషయాలు తెలిశాయి" అని కవిత తెలిపారు.

## సైబర్ క్రైమ్ గుట్టురట్టు

(మొదటిపేజీ తరువాయి)

గుట్టును సీబీఐ ఛేదించింది. నలుగురు చైనీయులు సహా 17 మందిపై, మరో 58 కంపెనీలపై ఛార్జిషీట్‌ను దాఖలు చేసింది. సీబీఐ తుది నివేదిక ప్రకారం... మ్యూల్ అకౌంట్ల ద్వారా దాదాపు రూ.వెయ్యి కోట్లను ఆ ముఠా 111 డొల్ల కంపెనీలకు మళ్లించింది. డమ్మీ డైరెక్టర్లు, తప్పుదారి పట్టించేలా ఉన్న పత్రాలు, నకిలీ చిరునామాలతో షెల్ కంపెనీలు రూపుదిద్దుకున్నాయి. ఈ కంపెనీలతో బ్యాంకు ఖాతాలను తెరిచి, డబ్బును పంచుకున్నారు. 2020లోనే ఈ మోసం మూలాలను గుర్తించారు. జూయి, హువాన్ లియు, వీజియన్ లియు, గ్వాన్హువా వాంగ్ అనే నలుగురు చైనీయులకు షెల్ కంపెనీలు నేరుగా సహకారం అందిస్తున్నాయి. ఆన్‌లైన్ ప్రచారాలు, నకిలీ రుణాలు, పెట్టుబడి పథకాలు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, ఆన్‌లైన్ ఆటలతో ప్రజలను మోసగించారు. భారీఎత్తున దేశ పౌరులపై ఆన్‌లైన్ మోసాలు జరుగుతుండటంతో కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలోని సైబర్ నేర సమన్వయ కేంద్రం సహకారంతో అక్టోబరులోనే ముగ్గురు వ్యక్తులను సీబీఐ అరెస్టుచేసింది. అనంతరం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సహా 27 రాష్ట్రాలపై దాడులు జరిపి మరింత సమాచారాన్ని సేకరించింది.

జనం వార్త
సోమవారం 15 డిసెంబర్ 2025

# మీరు వాడుతున్న తేనె స్వచ్ఛమైనదేనా..?

## ఇలా గుర్తించండి..!



తేనెను తీసుకోవడం వల్ల మనకు ఎలాంటి ఆరోగ్యకర ప్రయోజనాలు కలుగుతాయో అందరికీ తెలిసిందే. ఎన్నో రకాల విటమిన్లు, మినరల్స్, పోషకాలకు తేనె నిలయం. పలు అనారోగ్యాలను తగ్గించడంలో, శరీరానికి శక్తినివ్వడంలో తేనెకు అధిక ప్రాధన్యత ఉంది. ఆయుర్వేదంలోనూ తేనెను పలు ఔషధాలతోపాటుగా ఇస్తారు. అయితే ప్రస్తుత తరుణంలో తేనె వాడకం ఎక్కువవడంతో వ్యాపారులు దాన్ని కూడా కల్తీ చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో ప్రజలకు స్వచ్ఛమైన తేనె ఏదో నకిలీ తేనె ఏదో గుర్తించడం కష్టతరమైంది. అయితే పలు సూచనలు పాటిస్తే నకిలీ తేనెను ఇట్టే గుర్తించవచ్చు. దీంతో ఆరోగ్యంపై ప్రభావం పడకుండా జాగ్రత్తగా ఉండవచ్చు.



### నురగ వచ్చిందంటే..

ఇక సాధారణంగా మొలాసిస్, మొక్కజొన్న పిండి తదితర పదార్థాలను ఉపయోగించి నకిలీ తేనెను తయారు చేస్తారు. ఈ క్రమంలో నకిలీ తేనెను గుర్తించడం చాలా సులభమే అని చెప్పవచ్చు. కొద్దిగా తేనె తీసుకుని దానికి 2, 3 చుక్కల వెనిగర్ ఎస్సెన్స్ కలపాలి. అనంతరం వాటిని బాగా మిక్స్ చేయాలి. ఇలా వచ్చిన మిశ్రమం ఎక్కువగా నురగను విడుదల చేస్తుంటే దాన్ని నకిలీ తేనెగా గుర్తించాలి. ఎందుకంటే నకిలీ తేనె కోసం ఉపయోగించే పదార్థాల్లో చక్కెర కూడా ఉంటుంది. ఇది వెనిగర్‌తో కలిసినప్పుడు నురగలాంటి ద్రవాన్ని ఇస్తుంది. అసలైన తేనె ఇలా నురగను ఇవ్వదు. అలాగే కొద్దిగా తేనెను తీసుకుని బొటనవేలిపై వేయాలి. అనంతరం దాన్ని జాగ్రత్తగా పరిశీలించాలి. ఆ తేనె చుక్క వేలిపై చుట్టూ విస్తరిస్తే దాన్ని నకిలీ తేనెగా గుర్తించాలి.

### నీటిలో కలిపితే..

మీరు కొన్న తేనె అసలుదో, నకిలీదో గుర్తించాలంటే దాన్ని ఒక టేబుల్ స్పూన్ మోతాదులో తీసుకుని ఒక గ్లాస్ నీటిలో వేయాలి. నకిలీ తేనె అయితే వెంటనే నీటిలో కరుగుతుంది. అసలు తేనె గ్లాస్ అడుగు భాగంలోకి చేరుతుంది. అంతే తప్ప నీటిలో అంత త్వరగా కరగదు. అలాగే ఒక కాటన్ బాల్‌ను తీసుకుని దాన్ని తేనెలో ముంచాలి. అనంతరం దానికి అగ్గిపుల్లతో నిప్పు పెట్టాలి. అసలు తేనె అయితే కాటన్ బాల్ మండుతుంది. నకిలీ తేనె అయితే కాటన్ బాల్ మండదు. అదేవిధంగా ఒక తేనె చుక్కను గోరుపై వేసుకోవాలి. ఆ చుక్క గోరుపై అటు ఇటు కదిలితే అది నకిలీ తేనె అన్నమాట. అదే ఆ చుక్క కదలకుండా స్థిరంగా ఉంటే ఆ తేనెను అసలైందిగా భావించాలి.





### తేనెకు అసలు ఎక్స్‌పైరీ ఉండదు..

ఇక సాధారణంగా స్వచ్ఛమైన తేనె అయితే అసలు ఎక్స్‌పైరీ ఉండదు. కానీ మనకు మార్కెట్‌లో లభించే తేనెలో కొందరు రసాయనాలు కలుపుతారు. కనుక మనం కొనే తేనెకు ఎక్స్‌పైరీ ఉంటుంది. కానీ సహజసిద్ధంగా కొన్న తేనె అయితే ఎన్ని రోజులు ఉన్నా పాడవదు. రోజులు గడిచే కొద్దీ ఇంకా రుచి పెరుగుతుంది. మార్కెట్‌లో మీరు తేనె కొంటే వీలైనంత వరకు బ్రాండెడ్ కంపెనీలకు చెందిన తేనె అయితే మంచిది. అది కల్తీ అయ్యే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ఇలా పలు సూచనలు పాటిస్తే నకిలీ తేనెను గుర్తించడంతోపాటు దాన్ని కొనకుండా జాగ్రత్త పడవచ్చు.


# ఫోన్లను ఈ ప్రదేశంలో ఉంచడం చాలా ప్రమాదకరం..!

స్మార్ట్ ఫోన్లు అనేవి ప్రస్తుతం మన నిత్య జీవితంలో భాగం అయిపోయాయి. ఇంకా చెప్పాలంటే అవి మన నిత్యావసర వస్తువుగా మారాయి. ఫోన్లు లేకపోతే ఈ ప్రపంచాన్ని అసలు ఊహించుకోలేం అన్నంతగా పరిస్థితి మారింది. చాలా పనులను మనం ఫోన్లతో చక్కబెట్టుకుంటున్నాం. ఇప్పుడు 5జి అందుబాటులో ఉండడంతో చాలా వేగంగా అనేక పనులను చేసుకోగలుగుతున్నాం. అయితే అంతా బాగానే ఉంది కానీ ఫోన్లను వాడడంలోనే అసలు సమస్యంతా ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఫోన్లను ఎక్కడ పడితే అక్కడ పెట్టి ఉపయోగించకూడదని వారు హెచ్చరిస్తున్నారు. ఫోన్లను చాలా మంది అసలు ఏయే ప్రదేశాల్లో పెడుతుంటారు.. ఎలా వాడుతుంటారు.. వాటి వల్ల మనకు ఎలాంటి హాని కలుగుతుంది.. అన్న వివరాలను వైద్యులు తెలియజేస్తున్నారు.

### చార్జర్‌పై పెట్టడం..

చాలా మంది ఫోన్లను చార్జింగ్ పెట్టి వాటిని కింద పెట్టేందుకు టేబుల్, స్టూల్ లాంటిది ఏదీ లేదని చెప్పి వాటిని చార్జర్‌పైనే పెడతారు. కానీ ఇలా చేయరాదు. దీని వల్ల రేడియేషన్ బాగా వస్తుందని వైద్యులు అంటున్నారు. కనుక ఫోన్లను చార్జింగ్ పెట్టినప్పుడు వాటిని చార్జర్లపై ఉంచరాదు. అలాగే ఓవర్ నైట్ చార్జింగ్ కూడా ఫోన్లను పెట్టరాదు. దాని వల్ల ఫోన్లు పేలిపోయే ప్రమాదం ఉంటుంది. అలాగే చాలా మంది దిండు కింద ఫోన్లను పెట్టి నిద్రిస్తారు. ఇలా చేయకూడదు. ఇలా చేస్తే శరీరంలో మెలటోనిన్ ఉత్పత్తి తగ్గిపోతుంది. పలు అనారోగ్య సమస్యలు వస్తాయి. ముఖ్యంగా చర్మ





సమస్యలు వస్తాయి. కనుక నిద్రించేటప్పుడు ఫోన్లను దిండ్ల కింద అస్సలు పెట్టరాదు.

### జేబుల్లో ఉంచడం..

అమ్మాయిలకు ఎక్కువగా ఫోన్లను వెనుక జేబులో పెట్టుకునే అలవాటు ఉంటుంది. కానీ ఇలా చేయడం వల్ల ఫోన్ నుంచి వచ్చే రేడియేషన్ కడుపు నొప్పి, కాళ్ల నొప్పిని కలిగిస్తుంది. కనుక ఫోన్లను బ్యాక్ పాకెట్లలో పెట్టరాదు. అలాగే పురుషులు ఎక్కువగా ఫోన్లను ప్యాంటు ముందు జేబులో పెడతారు. ఇలా చేస్తే ఫోన్ల నుంచి వచ్చే రేడియేషన్ వల్ల వీర్య కణాలు నాశనం అవుతాయి. దీంతో సంతానం కలిగేందుకు అవకాశం తక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. అలాగే చాలా మంది నిద్రించేటప్పుడు తల పక్కన ఫోన్లను పెట్టి పడుకుంటారు. ఇలా చేయడం వల్ల ఫోన్ నుంచి విపరీతమైన రేడియేషన్ వస్తుంది. ఇది మెదడుపై ప్రభావం చూపిస్తుంది. దీని వల్ల మెదడులో కణతులు ఏర్పడే అవకాశం ఉంటుంది. అది బ్రెయిన్ ట్యూమర్‌కు దారి తీయవచ్చని వైద్యులు చెబుతున్నారు.

### చార్జింగ్ పెట్టినప్పుడు..

ఇక చాలా మంది ఫోన్‌ను చార్జింగ్ పెట్టినా కూడా ఏదైనా కాల్ లేదా మెసేజ్ వస్తే చార్జింగ్ అలాగే ఉంచి దాన్ని ఉపయోగించుకుంటారు. ఇలా కూడా చేయకూడదు. ఇది అత్యంత ప్రమాదకరం. దీని వల్ల ఫోన్ అధికంగా రేడియేషన్, హీట్‌కు గురై త్వరగా పేలిపోయే ప్రమాదం ఉంటుంది. అలాగే ఫోన్లకు కంపెనీలు ఇచ్చిన చార్జర్‌లనే ఎల్లప్పుడూ ఉపయోగించాలి. అలా కుదరకపోతే ఫోన్‌కు ఉన్న చార్జింగ్ కెపాసిటీకి సరిపోయే చార్జర్‌ను ఉపయోగించాల్సి ఉంటుంది. అలాగే ఫోన్‌ను చార్జింగ్ చేసిన అనంతరం కచ్చితంగా చార్జర్ ఉన్న స్విచ్ ను ఆఫ్ చేయాలి. ఈ విధంగా పలు సూచనలు పాటిస్తే ఫోన్లను జాగ్రత్తగా ఉపయోగించుకోవచ్చు. సురక్షితంగా ఉండవచ్చు.



జనం వార్త



నాగారం,డిసెంబర్ 14 (జనంవార్త) : ప్రేమ,దయ, క్షమాగుణంలో యేసు క్రీస్తు ప్రభువు ప్రపంచ మానవాళికి మార్గదర్శమని పాస్టర్ హగ్గయి అన్నారు. ఆదివారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని వాయు శక్తి నగర్ కాలనీలోని సహోదరుడు కరుణానందం స్వగృహం వద్ద ప్రీ క్రిస్మస్ కార్యక్రమాన్ని కన్నుల పండుగగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమాన్ని పాస్టర్ హగ్గయి ప్రార్ధన పూర్వకంగా ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యేసు రక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును.యేసు- నేనే మార్గమును, సత్యమును,జీవమును: నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు.అని గుర్తు చేశారు.ఈ సందర్భంగా యేసుప్రభు జన్మను చిన్నారులు నిర్వహించిన సంస్కృతిక వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రేమ విందును ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఎల్-షా ద్దాయ్ విశ్వాసులు పాల్గొన్నారు.

# యేసుప్రభువు అందరికీ దేవుడు

## క్రీస్తు సందేశం మానవాళికి మార్గదర్శం

## ఘనంగా ప్రీ క్రిస్మస్ మహోత్సవం







**చాలా మంది తమ దైనందిన జీవితంలో తగిన ఆర్థిక ప్రణాళిక అమలు చేస్తుంటారు. ఈ క్రమంలో భవిష్యత్తు లక్ష్యాలను దెబ్బతీసే ఆర్థిక తప్పులు చేస్తూ ఉంటారు. ఇలాంటి తప్పులు దీర్ఘకాలికంగా విపరీత నష్టాలను కలుగజేస్తాయి. వీటిని విస్మరిస్తే..మీ ఆర్థిక భవిష్యత్తును రక్షించుకోవడంలో విఫలమవుతారు. కాబట్టి, డబ్బు ఆదాకు, ఆర్థిక ప్రణాళికకు సంబంధించి చేయాల్సిన ముఖ్యమైన పనులేంటో ఇక్కడ తెలుసుకుందాం.**

## అత్యవసర నిధి

ప్రతి ఒక్కరికి ఈ రోజు ఆదాయం మెరుగ్గా ఉన్నట్లు అనిపించవచ్చు. కానీ, అందరి ఆర్థిక పరిస్థితి అన్ని వేళలా ఒకేలా ఉండకపోవచ్చు. ఎందుకంటే, భవిష్యత్ అనూహ్యమైంది. ఉదాహరణకు, కొవిడ్ లాంటి సమయంలో అకస్మాత్తుగా ఉపాధి కోల్పోవడం లేదా తాత్కాలికంగా కొంత కాలం పాటు అనారోగ్యానికి గురయి ఇంటికే పరిమితం కావడం జరిగింది. కానీ, ఇలాంటప్పుడు కుటుంబానికి సంబంధించిన ఏ ఖర్చులూ ఆగవు. కాబట్టి, ప్రతి ఒక్కరూ 3-6 నెలల జీవన వ్యయాలను కవర్ చేసే అత్యవసర నిధిని తప్పక సమకూర్చుకోవాలి. ఈ నిధి, తాత్కాలికంగా కొంత కాలానికి సరిపోవడమే కాకుండా మిమ్మల్ని దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాల వైపు విజయవంతంగా నడిపించడానికి సహాయపడుతుంది.





# డబ్బు ఆదా చేయాలనుకుంటున్నారా?

## జీవనశైలి

మీరు బాగా సంపాదన కలిగి ఉన్నప్పటికీ, అధికంగా ఖర్చు చేయాల్సిన పని లేదు. ముఖ్యంగా, మీరు అర్థిక లక్ష్యాల కోసం సరైనా ప్రణాళిక వేసుకునే బదులు విలాసవంతమైన జీవనశైలిని గడపడంపై దృష్టి పెట్టడం వల్ల భవిష్యత్తులో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురవుతారు. ఖరీదైన జీవనశైలి మీ ఆర్థిక భవిష్యత్తును నాశనం చేస్తుంది. ఎక్కువ ఖర్చు చేయడానికి బదులుగా దీర్ఘకాలానికి ఆర్థిక భవిష్యత్తుకు హామినిచ్చే %బీమా% వంటి పెట్టుబడి పథకాలను ఎంచుకుని పదవీ విరమణ కోసం ప్లాన్ చేయడం మంచిది. ఇది భవిష్యత్తుకు పునాదిలా పనిచేస్తుంది.

## ఆరోగ్య సంరక్షణ

చాలా మంది ఇప్పుడు ఆరోగ్యంగానే ఉన్నాం, భవిష్యత్తులో కూడా ఇలాగే ఆరోగ్యాన్ని కలిగి ఉంటామనే భ్రమతో ఉండి ఆరోగ్య బీమాను నిర్లక్ష్యం చేస్తారు. వయసు పెరిగిన తర్వాత ఆరోగ్య బీమా తీసుకుంటే అనేక నియమనిబంధనలు అమలవుతాయి. సరైన బీమా లేకుంటే అకస్మిక వైద్య ఖర్చులు మీ బ్యాంకు ఖాతాను ఖాళీ చేసేస్తాయి. అందుచేత, యుక్త వయసులోనే మంచి క్లెయిం సెటిల్మెంట్ రేషియో ఉన్న ఆరోగ్య బీమాను ఎంచుకోవడం వల్ల భవిష్యత్తు అనారోగ్య పరిణామాలను అధిగమించొచ్చు. ఆరోగ్య బీమా..అత్యవసర సమయంలో అవాంఛిత భారీ వైద్య ఖర్చులను నివారించడానికి సహాయపడుతుంది. అందువల్ల, స్థిరమైన, సురక్షితమైన ఆర్థిక భవిష్యత్తును కలిగి ఉండడానికి బీమా తప్పనిసరి.

## ద్రవ్యోల్బణం

ద్రవ్యోల్బణం..మీరు పొదుపు చేసిన నిధుల కొనుగోలు శక్తిని తగ్గిస్తుంది. ఉదాహరణకు, మీ తల్లిదండ్రులను వారి చిన్నతనంలో రూ.100తో ఎన్ని వస్తువులను కొనగలిగారో అడగండి. వారు చెప్పిన సమాధానం విని ద్రవ్యోల్బణం డబ్బు విలువను ఎంత తీవ్రంగా తగ్గిస్తుందో మీరు గ్రహిస్తారు. అందువల్ల, ద్రవ్యోల్బణాన్ని తట్టుకునే సాధనాల్లో మీరు పెట్టుబడి పెట్టడం చాలా ముఖ్యం. కొన్ని పెట్టుబడి సాధనాలు ద్రవ్యోల్బణ రేటు కంటే మీ మదుపును ఎక్కువ రేటుతో వృద్ధి చెందేలా చూస్తాయి. కొంతవరకు సంప్రదాయ పెట్టుబడులు ఉన్నాసరే, మ్యూచువల్ ఫండ్లు, స్టాక్స్, గోల్డ్ ఈటీఎఫ్‌లు వంటి ద్రవ్యోల్బణాన్ని అధిగమించగల సామర్థ్యం ఉన్న ఆస్తులలో కూడా పెట్టుబడి పెట్టండి. ఇలాంటి సాధనాలలో పెట్టుబడి పెట్టడం వల్ల రాబోయే సంవత్సరాల్లో మీ కొనుగోలు శక్తిని కాపాడుకోవచ్చు.

## ఒకే ఆదాయ వనరు

మీరు ఒకే ఆదాయ వనరుపై మాత్రమే ఆధారపడడం మీ ఆర్థిక భవిష్యత్తుకు అంత మంచిది కాదు. ఏదైనా కారణం చేత మీ ఏకైక ఆదాయ వనరుకు అంతరాయం కలిగితే మీరు ఆర్థిక ఇబ్బందులకు గురవుతారు. ప్రస్తుతం ప్రజలకు కావాల్సిన చాలా ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. కానీ, వాటికి సరైన మార్కెటింగ్ అవసరం. కాబట్టి, మీరు కొన్ని ఉత్పత్తులకు ఏజంట్‌గా(మార్కెటింగ్) చేయడం ద్వారా మీరు రెండవ ఆదాయ వనరును సృష్టించుకోవచ్చు. ఇలాంటి ఆదాయ వనరులు..మీ ఆర్థిక ఇబ్బందులను తగ్గించడమే కాకుండా మీ జీవితానికి ఆర్థిక స్థిరత్వాన్ని అందిస్తాయి. ముఖ్యంగా, మార్కెటింగ్ చేయగలిగిన వారు ఎలాంటి వృత్తినయినా అవలీలగా నిర్వహించగలరని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి.



## ఆర్థిక అక్షరాస్యత

ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరికి ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండడం చాలా అవసరం. ఎందుకంటే, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన లేనివారి పెట్టుబడి నిర్ణయాలు సరిగ్గా ఉండవు, ఉన్న అవకాశాలు కూడా వారు కోల్పోయే అవకాశం ఉంటుంది. ఈ రోజుల్లో ప్రతి ఒక్కరు ఆర్థికపరమైన ప్రాథమిక అంశాలను తెలుసుకోవడం చాలా అవసరం. మీకు ప్రొఫెషనల్ ఆర్థిక సలహాదారు ఉన్నప్పటికీ, వారి సూచనల వెనుక ఉన్న ఆలోచనా ప్రక్రియను కనీసం అర్థం చేసుకోకుండా వారి సలహాను గుడ్డిగా నమ్మడం అవివేకమవుతుంది. కాబట్టి, డబ్బు నిర్వహణ విషయంలో మీరు తగినంత జ్ఞానం కలిగి ఉండాలి.



అడగనిదే అమ్మ అయినా అన్నం పెట్టదు అంటారు ఇది ఒకప్పటి మాట... కానీ ఇప్పుడు అడిగి మరీ అప్పులు ఇస్తామంటూ వెంటపడి మరీ నిండా ముంచుతున్నారు. సామాన్యుడి అవసరమే పెట్టుబడిగా ఎంచుకొని లెక్కకు మించి పుట్టగొడుగుల్లా అప్పులు ఇచ్చే యాప్స్ ఇప్పుడు సామాన్యుల పాలిట యమగండంలా తయారయ్యాయి. మేమంటే మేము అప్పు ఇస్తాం. మీరు సరే అంటే చాలు... క్షణాల్లో మీ అకౌంట్లో డబ్బులు వేస్తాం అంటూ వెంటపడుతున్నారు. తీసుకున్న డబ్బు సమయానికి కట్టకుంటే వాటికి వడ్డీతో పాటు చక్రవడ్డీ కలిపి వసూలు చేసే దాకా వదలడం లేదు. అంతటితో ఆగకుండా రకరకాల తరహాలో వేధింపులకు గురిచేస్తున్నారు.


**స్నేహితులు దైర్యం చెప్పడంతో ఆత్మహత్య చేసుకోని యువకుడు :**

మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు ఓ ప్రైవేట్ యాప్ లో రూ. 2 వేల లోన్ తీసుకుని సమయానికి కట్టకపోవడంతో తన ఫోటోలను వీడియో రూపంలో మార్ఫింగ్ చేసి తన ఫోన్ కాంటాక్ట్ లో ఉన్న పలువురి వాట్సాప్ నంబర్లకు పంపడంతో అయోమయానికి గురైన సదరు యువకుడు ఆత్మహత్య చేసుకోవాలని ఇంట్లో చెప్పకుండా బయటకి వెళ్లిన విషయం తెలుసుకున్న పలువురు బాధితుని స్నేహితులు అడ్డుకుని దైర్యం చెప్పడంతో ఊరుకుని స్నేహితుల వద్ద చేతి బదులు తీసుకుని సుమారు తీసుకున్న రెండు వేల రూపాయలకు 25వేల వరకు చెల్లించాడు.




# ప్రైవేట్ లోన్ యాప్స్ దారుణాలు

- వెంటపడి మరీ క్షణాల్లో రుణాలు
- చెల్లింపులో ఆలస్యమైతే రకరకాల వేధింపులు
- పరువు పోతుందని ఆత్మహత్యలు
- ప్రైవేట్ లోన్ యాప్ లకు దూరంగా ఉండాలని పోలీసుల హెచ్చరికలు
- సర్వీస్ చార్జీలు, పెనాల్టీలతో 40శాతం వరకు అధిక వడ్డీ చెల్లింపు
- స్నేహితులు దైర్యం చెప్పడంతో ఆత్మహత్య చేసుకోని యువకుడు




**మేడ్చల్ :** అడగనిదే అమ్మ అయినా అన్నం పెట్టదు అంటారు ఇది ఒకప్పటి మాట... కానీ ఇప్పుడు అడిగి మరీ అప్పులు ఇస్తామంటూ వెంటపడి మరీ నిండా ముంచుతున్నారు. సామాన్యుడి అవసరమే పెట్టుబడిగా ఎంచుకొని లెక్కకు మించి పుట్టగొడుగుల్లా అప్పులు ఇచ్చే యాప్స్ ఇప్పుడు సామాన్యుల పాలిట యమగండంలా తయారయ్యాయి. ఒకప్పుడు అప్పు కావాలంటే బ్యాంకుల్లో సవాలక్ష కాగితాలు, విచారణ, తనఖా పెడితే గాని అప్పు ఇవ్వని పరిస్థితి నుండి మేమంటే మేము అప్పు ఇస్తాం... మీరు సరే అంటే చాలు క్షణాల్లో మీ అకౌంట్లో డబ్బులు వేస్తాం అంటూ వెంటపడుతున్నారు. డబ్బులు వేయడం వరకు బాగానే ఉన్నా ఒకసారి వేసిన తర్వాత అసలు పంచాయితీ మొదలయినట్లే. తీసుకున్న డబ్బు సమయానికి కట్టకుంటే వాటికి వడ్డీతో పాటు చక్రవడ్డీ కలిపి వసూలు చేసే దాకా వదలడం లేదు. అంతటితో ఆగకుండా రకరకాల తరహాలో వేధింపులకు గురిచేస్తున్నారు. ఇటీవల కాలంలో ఆండ్రాయిడ్ ఫోన్ల వినియోగం పెరిగిపోయింది. చిన్న పిల్లాడి నుంచి పెద్దవారి వరకు సెల్ ఫోన్ అనేది తప్పనిసరి అయింది. ప్రధానంగా యువకుల వద్ద మాత్రం మంచి మంచి ఆండ్రాయిడ్ ఫోన్లు ఉండడం సర్వ సాధారణం అయిపోయింది. యువత కరోనా తర్వాత ఇళ్లకే పరిమితం కాగా చాలా మంది ఉ ద్యోగాలు కోల్పోయి ఆర్థిక మాంధ్యంలో చిక్కుకపోయారు. దీనినే ఆసరగా చేసుకున్న కొందరు ఆన్లైన్ ద్వారా అప్పులు ఇచ్చే దందా యథేచ్చగా కొనసాగిస్తున్నారు. ప్లే స్టోర్ ఓపెన్ చేస్తే చాలు విచ్చలవిడిగా లోన్ యాప్స్ కనిపిస్తుండడంతో పాటు మరికొన్ని లింకుల ద్వారా రుణాలను అందిస్తున్నాయి. వెయ్యి నుండి మొదలు రూ.50 వేల వరకు అప్పటికప్పుడు లోన్ అందజేస్తుండగా పది రోజుల్లో తిరిగి డబ్బులు చెల్లించే విధంగా ఈ యాప్ లు అందిస్తున్నాయి. ఇచ్చిన డబ్బుకు తిరిగి చెల్లించే వరకు సర్వీస్ చార్జీలు, వడ్డీతో పాటు పెనాల్టీలతో కలుపుకొని 35 నుంచి 40 శాతం వరకు వడ్డీ చెల్లించవలసి వస్తోంది.

## ఆలస్యం అయిందా వారి పని గోవిందా...:

ప్లే స్టోర్ నుండి ఈ లోన్లకు సంబంధించిన యాప్స్ డౌన్లోడ్ చేసి ఇన్స్టాల్ చేసుకున్న తర్వాత ఫోన్లోని కాంటాక్ట్స్, ఫోటోలు, వ్యక్తిగత సమాచారం మొత్తం ఆ యాప్ తీసుకోవడం జరుగుతోంది. దీంతో ఆ



వ్యక్తి యొక్క వ్యక్తిగత సమాచారం పూర్తిగా తెలియడంతో పాటు ఫోన్ వారి కంట్రోల్లోకి వెళ్ళిపోతుంది. అప్పు తీసుకున్న వ్యక్తి సకాలంలో అప్పు చెల్లించకపోవడంతో సదరు అప్పు ఇచ్చిన సంస్థలు బెదిరింపులకు పాల్పడుతున్నారు. డబ్బులు కట్టాలని అదే పనిగా ఫోన్లు చేస్తుండగా ఫోన్ లిఫ్ట్ చేయకుంటే సదరు వ్యక్తికి సంబంధించి వ్యక్తి గత సమాచారం ఆధారంగా అతడి ఫోన్ నెంబర్లతోనే అందరికి అప్పు చెల్లించడం లేదని వాట్సాప్, సాధారణ సందేశాలు పంపుతూ వేధింపులకు గురిచేస్తున్నారు. అంతే కాకుండా ఎవరితో అయితే ఎక్కువగా ఫోన్లో మాట్లాడుతున్నారో చూసి వారికి ఫోన్ చేసి ఫలానా వ్యక్తి మా దగ్గర అప్పు తీసుకొని మీ నెంబర్ ఇచ్చారు. అతడు స్పందించడం లేదు. మీకు లీగల్ నోటీసులు పంపిస్తున్నాం అని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

## ప్రైవేట్ లోన్ యాప్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలి

**సీహెచ్.శంకర్ రెడ్డి, అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్, మేడ్చల్ డివిజన్**




ఇటీవల కాలంలో అప్పులు ఇచ్చే యాప్స్ ఎక్కువయ్యాయి. వీటిని షార్క్ యాప్స్ అంటారు. ఈ పేరు ఎందుకంటే సొరచేప మాదిరిగా ఓ వ్యక్తి ఆర్థికస్థితిని తినేస్తాయని అర్థం. ఈ యాప్స్ క్షణాల్లో రుణాలు మంజూరు చేసి అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారు. డబ్బులు సకాలంలో కట్టని వారికి వారి ఫోన్లలో వ్యక్తిగత సమాచారాన్ని ముందే సేకరించి రుణగ్రస్తులను రకరకాలుగా వేధింపులకు గురి చేస్తున్నట్లు మాకు సమాచారం అందుతోంది. ఇలాంటి యాప్స్ పట్ల యువకులు జాగ్రత్తగా ఉండాలి. ఎవరైనా అసభ్య పదజాలంతో సందేశాలు పంపితే అది ఐటి యాక్టు 67 కిందకు వస్తుంది. అలాంటి వారిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుంది. ఎవరికైనా రుణాలు అవసరమైనప్పుడు ఆర్బీఐ అధీనంలో ఉండే సంస్థల నుంచి మాత్రమే తీసుకోవాలి.



# బావ చూపిన బాటలో.. డ్రగ్ పెడ్లర్‌గా మారిపోయిన సమీప బంధువు

- పాలు, గ్రానైట్స్ వ్యాపారంలో విఫలం కావడంతో డ్రగ్స్ దందాలోకి
- ఇద్దరితో కలిసి గుట్టుగా వ్యవహారం
- ముగ్గురినీ అరెస్టు చేసిన హెచ్-న్యూ పోలీసులు

**హైదరాబాద్:** నిరుద్యోగిగా మారిన బావమరిదిని డ్రగ్ పెడ్లర్‌గా మార్చాడో బావ. ఏపీలోని ప్రకాశం జిల్లా కేంద్రంగా ఎండీఎంఏ మాదకద్రవ్యాల దందా ప్రారంభించిన ఇతగాడు హైదరాబాద్‌కు చెందిన ఇద్దరిని సబ్ పెడ్లర్స్‌గా మార్చుకున్నాడు. వీరితో కలిసి కొన్నాళ్లుగా వ్యవహారాలు నడుపుతున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ అధికారులు ముగ్గురికీ చెక్ చెప్పారు. మాసబ్‌ట్యాంక్ పోలీసులతో కలిసి నిర్వహించిన ఆపరేషన్‌లో వీరిని అరెస్టు చేయడంతోపాటు 11 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆదివారం వెల్లడించారు.

## ఆ రెండింటిలో సక్సెస్ కాకపోవడంతో...

ప్రకాశం జిల్లా పేర్నమిట్టకు చెందిన ఉప్పుటూరి కార్తీక్ ఆర్థిక ఇబ్బందులతో చదువు పూర్తి చేయలేకపోయాడు. సొంతూరిలో పాల కేంద్రం, గ్రానైట్స్ వ్యాపారం చేసినా సఫలీకృతం కాలేదు. దీంతో దురలవాట్లకు బానిసగా మారాడు. రూ.2 కోట్ల వరకు అప్పులు చేశాడు. నెల్లూరు నుంచి వచ్చి నేరేడ్‌మెట్‌లో స్థిరపడిన సీహెచ్ బాలాజీ ఇతడికి బావ అవుతాడు. 2022లో తండ్రి చనిపోవడంతో బాలాజీ డెయిరీ వ్యాపారాన్ని నిర్వహిస్తూ నెలకు రూ.22 వేల వరకు సంపాదిస్తున్నాడు. సిగరెట్‌తో మొదలుపెట్టి ఎండీఎంఏ వినియోగం వరకు వెళ్లిన ఇతగాడు ఆ డ్రగ్‌కు ఉన్న డిమాండ్‌ను కార్తీక్‌కు చెప్పాడు. దీంతో కార్తీక్ కూడా ఈ దందా ప్రారంభించాలని నిర్ణయించుకున్నాడు. తొలినాళ్లలో బెంగళూరు వరకు వెళ్లి నైజీరియన్ల నుంచి ఈ డ్రగ్ ఖరీదు చేసి తెచ్చేవాడు. కొన్నాళ్లుగా నైజీరియన్లు నేరుగా ఇవ్వకుండా తమ ఏజెంట్ల ద్వారా పంపిస్తుండటంతో బెంగళూరుతోపాటు ఆదిలాబాద్‌కూ వెళ్లి తేవడం మొదలెట్టాడు. దీన్ని ఒక గ్రాము చొప్పున రీప్యాక్ చేసి ఎక్కువ ధరకు అమ్మేవాడు. ఇతడి నుంచి బాలాజీ కూడా క్రమం తప్పకుండా డ్రగ్ ఖరీదు చేసేవాడు. ఈ దందాలో దిగిన కార్తీక్ తన పేరును అలెక్స్‌గా మార్చుకున్నాడు. ఓ దశలో బాలాజీ ఇతడికి సబ్%-%పెడ్లర్‌గా మారిపోయాడు. బీటెక్ చదువుతున్న జీడిమెట్లకు చెందిన టి.దీపక్ పార్ట్‌టైమ్‌గా టెక్నికల్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇతడు కూడా ఎండీఎంఏ వినియోగం నుంచి విక్రేతగా మారాడు.

## డెడ్ డ్రాప్ విధానంలో సరఫరా...

ఈ ముగ్గురూ తమ ఉనికి బయటపడకుండా ఎండీఎంఏను విక్రయిస్తున్నారు. ఆన్‌లైన్, సోషల్‌మీడియా కస్టమర్లతో రేటు ఖరారు చేసుకుంటారు. ఆపై వారికి క్యూఆర్ కోడ్ పంపి డబ్బు బదిలీ చేయించుకుంటారు. ఆపై ఏదైనా ఓ ప్రాంతంలో డ్రగ్ పెట్టి దాని ఫొటోతోపాటు లొకేషన్‌ను వినియోగదారుడికి షేర్ చేస్తారు. మిగిలిన ఇద్దరూ అలెక్స్ నుంచే సరుకు తీసుకుని పరిచయస్తులైన కస్టమర్లకు అధిక ధరలకు అమ్ముతున్నారు. వీళ్లు ఒక్కో గ్రాము రూ.నాలుగు వేల నుంచి రూ.ఐదు వేలకు కొని... రూ.ఎనిమిది వేల నుంచి రూ.10 వేలకు విక్రయిస్తున్నారు. వీరి దందాపై సమాచారం అందడంతో ఇన్‌స్పెక్టర్ ఎస్.బాలస్వామి నేతృత్వంలో ఎస్సై బి.మనోజ్‌కుమార్‌తో కూడిన బృందం మాసబ్‌ట్యాంక్‌లో వలపన్నింది. ఎండీఎంఏ సరఫరా చేయడానికి వచ్చిన అలెక్స్‌తోపాటు తీసుకోవడానికి వచ్చిన మిగిలిన ఇద్దరినీ పట్టుకుంది.



# పద్మశాలి సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

**కూకట్ పల్లి,డిసెంబర్ 13(జనం వార్త) :** ఆల్విన్ కాలనీ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆ సంక్షేమ సంఘ సభ్యులు ఆదివారం ఆవిష్కరించారు. వెంకటేశ్వర నగర్ దీనబంధు కాలని లోని శివ భక్త మార్కండేయ ఆలయంలో స్వామివారికి సంక్షేమ సంఘ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అఖిల భారత పద్మశాలి అన్న సత్రం యాదగిరి గుట్ట అధ్యక్షులు,గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు కత్తుల సుదర్శన్,ప్రధాన కార్యదర్శి కల్లేపల్లి రాజు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. అనంతరం అతిధులు మాట్లాడుతూ పద్మశాలీలను ఏకం చేయడానికి సంక్షేమ సంఘ సభ్యులు కృషి చేయాలని సూచించారు. పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షులు చిట్టిపోలు భిక్షమయ్య, కార్యదర్శి కోడూరి ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర బీసీ నాయకులు జర్నలిస్టు తెల్ల హరికృష్ణ, ఆల్విన్ కాలని పద్మశాలి సంక్షేమ సంఘం సభ్యులు,కార్యవర్గ సభ్యులు, పద్మశాలి కుల బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో కాంగ్రెస్ ధర్నా పూర్తిగా విఫలం

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**హైదరాబాద్:** ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఓటు చోరీ పేరుతో కాంగ్రెస్ చేపట్టిన ధర్నా పూర్తిగా విఫలమైందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆదివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'ఈ ధర్నాలో కాంగ్రెస్ ఆరోపణలను ప్రజలు తిరస్కరించారు. రాహుల్‌గాంధీ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు బూటకమైన ఓటు చోరీ కార్యక్రమాన్ని తలకెత్తుకున్నారు. వంద ఎన్నికల్లో విఫలమైన తర్వాత కూడా రాహుల్‌గాంధీ తనను తాను గొప్ప నాయకుడిగా ఎలా సమర్థించుకోగలరు? భారతదేశాన్ని వ్యతిరేకించే విదేశీ శక్తులతో కలిసి పనిచేసే రాహుల్‌గాంధీ వైఫల్యాలను దాచే ప్రయత్నంలో భాగంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే భాజపాను దేశ ద్రోహిగా పిలిచారు. ఈ పదం తన సొంత పార్టీ యువరాజు రాహుల్‌గాంధీకి బాగా వర్తిస్తుందని ఆయనకు తెలుసు. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకగాంధీ ఎన్నికల కమిషన్‌లోని సభ్యులపై దాడి చేస్తూనే ఉన్నారు' అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు.


# హెబ్బా.. మ్యారేజ్ చేసుకుంటున్నావా?

యంగ్ బ్యూటీ హెబ్బా పటేల్ 'కుమారి 21 ఎఫ్' మూవీతో టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయమయ్యింది. తన ఫస్ట్ సినిమాతోనే స్టార్‌డమ్ అందుకుంది. దీంతో ఓ రేంజ్‌లో పాపులర్ అయిపోతుంది అని అందరూ అనుకున్నారు. బట్ ఈ మూవీ తర్వాత ఎన్నో సినిమాలు చేస్తున్నా సరైన హిట్ మాత్రం అందుకోలేకపోయింది. ఇక 'ఓదెల రైల్వే స్టేషన్'లో డీ-గ్లామర్ పాత్ర చేసినా పెద్ద గుర్తింపు రాలేదు. అయినప్పటికీ డీలా పడకుండా వచ్చిన అవకాశాల్లో నటిస్తూ మెప్పిస్తుంది. ప్రజెంట్ వరుస సినిమాల్లో నటిస్తూ మెప్పించడానికి రెడీ అవుతుంది. ఇదిలా ఉంటే.. తాజాగా హెబ్బా పటేల్ తన సోషల్ మీడియాలో కొన్ని పిక్స్ షేర్ చేసింది. అందులో కళ్లకు కాటుక పెట్టుకుని ట్రెడిషనల్ లుక్‌లో కనిపించింది. ఇక ఈ ఫొటోస్‌కు 'ఆలస్యమైన పెళ్లి చూపులు' అనే క్యాప్షన్ జోడించింది. దీంతో ఈ పోస్ట్ కాస్త నెట్టింట వైరల్‌గా మారింది. ఇక వాటిని చూసిన నెటిజన్లు మ్యారేజ్ చేసుకుంటున్నావా అంటూ కామెంట్స్ చేస్తున్నారు.



# 48 గంటలు నిద్రపోలేదు

యంగ్ హీరోయిన్ షాలినీ పాండే 'అర్జున్ రెడ్డి'తో సూపర్ ఫేమ్ అయిపోయింది. ఒక్క సినిమా సక్సెస్‌తోనే వరుస ఆఫర్లు అందుకుంది. ప్రస్తుతం బాలీవుడ్‌లో పాగా వేసిన బ్యూటీ.. తాజాగా కొత్త చిత్రాన్ని కూడా ప్రకటించింది. అయితే ఈ మధ్య ధనుష్, కృతి సనన్ నటించిన 'తేరే ఇష్క్ మే' సినిమా చూసిన ఆమె.. ఇందుకు సంబంధించిన రివ్యూ ఇచ్చింది. '48 గంటలు నిద్రపోలేదు. నా హార్ట్‌లో 'తేరే ఇష్క్ మే' ఇంకా బర్న్ అవుతోంది. ధనుష్ సార్ .. మీరు చెప్పే ఫినామినల్ అంటే ఇదే. రెహమాన్ సార్ మ్యూజిక్ నెక్ట్స్ లెవల్. కృతి సనన్ బ్రెత్ టేకింగ్ పర్ఫార్మెన్స్ ఇచ్చింది. ఆనంద్ ఎల్ రాయ్ ప్యూర్ మాస్టర్ క్లాస్ డైరెక్షన్' అంటూ సినిమాపై ప్రశంసల వర్షం కురిపించింది. ఇక ఈ పోస్ట్‌పై స్పందిస్తున్న షాలిని ఫ్యాన్స్.. ఆమె మంచి మనసుపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. చక్కగా, తిని పడుకోవాలని.. ఆరోగ్యం పాడు చేసుకోవద్దని సూచిస్తున్నారు.





# బికినీలో దివి హాట్ షో

రియాలిటీ షో బిగ్‌బాస్ సీజన్-4 ద్వారా ఫుల్ పాపులారిటీ తెచ్చుకున్న వారిలో దివి వద్త్య ఒకరు. ఆ తర్వాత పలు చిత్రాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించిన దివి తన గ్లామర్‌తో ఫాలోయింగ్‌ను మరింత పెంచుకుంది. అలా ఏకంగా సూపర్ స్టార్ మహేష్ బాబు 'మహర్షి' మూవీలో కీలక పాత్రలో కనిపించింది. అంతేకాకుండా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ 'పుష్ప-2'లో విలేకరిగా నటించి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఓ వైపు సినిమాల్లో నటిస్తూనే బుల్లితెరపై కూడా పలు షోస్, ప్రోగ్రాంమ్స్‌తో ఫుల్ బిజీ అయిపోయింది. అలాగే లంబసింగితో హీరోయిన్‌గా కూడా మారిపోయింది. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, హీరోయిన్‌గా చాన్సులు అందుకుంటూ ఫుల్ ఫామ్‌లో ఉంది. అయితే ఎంత బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్‌గా ఉంటోంది. తన హాట్ ఫొటోలను షేర్ చేస్తూ కుర్రకారుకు చెమటలు పట్టేలా చేస్తోంది. తాజాగా, దివి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా బికినీ ఫొటోలను షేర్ చేసి సోషల్ మీడియాలో అగ్గి రాజేసింది. వాటిని చూసిన నెటిజన్లు కొందరు చాలా బాగున్నావ్ అని పొగుడుతుంటే.. మరికొందరు మాత్రం ఫాలోవర్స్ కోసమే ఇంతకి తెగించావా? అని బోల్డ్ కామెంట్లు చేస్తున్నారు.






# భారత్‌దే మూడో టీ20

విజృంభించిన అర్ష్‌దీప్, వరుణ్, హర్షిత్
అభిషేక్ మెరుపులు
దక్షిణాఫ్రికాపై విజయం

**ధర్మశాల :** భారత్ మళ్లీ గాడిలో పడింది. రెండో టీ20లో ఓటమి తర్వాత పుంజుకుని మూడో టీ20లో అదిరే విజయాన్ని అందుకుంది. ఆదివారం టీమ్ఇండియా 7 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. మొదట 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అర్ష్‌దీప్ సింగ్ (2/13), వరుణ్ చక్రవర్తి (2/11), కుల్‌దీప్ (2/12), హర్షిత్ రాణా (2/34) విజృంభించడంతో.. దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 117 పరుగులకే ఆలౌటైంది. మార్‌క్రమ్ (61, 46 బంతుల్లో 6x4, 2x6) మాత్రమే రాణించాడు. అభిషేక్ శర్మ (35, 18 బంతుల్లో 3x4, 3x6) మెరుపులతో భారత్ 15.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. శుభ్‌మన్ గిల్ (28, 28 బంతుల్లో 5x4), తిలక్‌వర్మ (26 నాటౌట్, 34 బంతుల్లో 3x4) కూడా రాణించారు. ఈ మ్యాచ్‌లో బుమ్రా, అక్షర్‌లకు విశ్రాంతి ఇచ్చిన భారత్.. కుల్‌దీప్, హర్షిత్‌లను ఆడించింది. బుధవారం లఖ్‌నవూలో నాలుగో టీ20 జరగనుంది.

### అభిషేక్ దూకుడు:

స్వల్ప ఛేదనలో ఇన్నింగ్స్‌ను భారత్ దూకుడుగా ఆరంభించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ తనశైలిలో ఆడి స్కోరును పరుగులెత్తించాడు. దక్షిణాఫ్రికా బౌలర్లను ఏమాత్రం కుదురుకోనీయకుండా ఎదురుదాడి చేశాడు. తొలి బంతికే సిక్స్ బాదిన అతడు.. యాన్సెన్ వేసిన రెండో ఓవర్లో మరో సిక్స్, ఫోర్ బాదేశాడు. ఫామ్‌లో లేని శుభ్‌మన్ గిల్ (28బీ 28 బంతుల్లో 5ఐ4) ఈ మ్యాచ్‌లో కాస్త మెరుగ్గా ఆడాడు. మ-రోవైపు అభిషేక్ జోరు కొనసాగించడంతో 5 ఓవర్లకు 60/0తో భారత్ లక్ష్యం దిశగా దూసుకెళ్లింది. ఈ క్రమంలో బార్ట్‌మన్ బౌలింగ్‌లో పాయింట్ దిశగా అతడు కొట్టిన సిక్సర్ హైలైట్. జోరుమీదున్న అభిషేక్‌ను బోష్ ఔట్ చేసి దక్షిణాఫ్రికాకు బ్రేక్ ఇచ్చాడు. మూడో స్థానంలో వచ్చిన తిలక్‌వర్మతో కలిసి గిల్ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు. లక్ష్యం (78 బంతుల్లో 43) అందుబాటులో ఉండడంతో ఈ జోడీ ఆచితూచి ఆడింది. 9-13 ఓవర్ల మధ్య దక్షిణాఫ్రికా కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో 4 ఓవర్లలో కేవలం 12 పరుగులే వచ్చాయి. ఈ స్థితిలో శుభ్‌మన్ ఔటయ్యాడు. ఫామ్‌తో తంటాలు పడుతున్న సూర్యకుమార్ (11 బంతుల్లో 12) రెండు ఫోర్లు కొట్టి వెనుదిరగ్గా... శివమ్ దూబె (10 నాటౌట్) పని పూర్తి చేశాడు. భారత్ మరో 25 బంతులు ఉండగానే లక్ష్యాన్ని అందుకుంది.

### దక్షిణాఫ్రికాకు కళ్లెం:

అంతకుముందు మంచుతో కూడిన వాతావరణంలో భారత పేసర్లు ఆరంభం నుంచే స్వింగ్‌తో విజృంభించారు. దీంతో 5 ఓవర్లలో దక్షిణాఫ్రికా మూడు వికెట్లు కోల్పోయి 14 పరుగులే చేసింది. తొలి ఓవర్ నాలుగో బంతికి హెండ్రిక్స్ (0)ను ఔట్ చేయడం ద్వారా అర్ష్‌దీప్ వికెట్ల వేటను మొదలుపెట్టాడు. ఈ వికెట్‌ను భారత్ సమీక్షలో సాధించింది. ఆ తర్వాత హర్షిత్ రాణా అందుకున్నాడు. రెండో టీ20లో అదిరే ఇన్నింగ్స్ ఆడిన క్వింటన్ డికాక్ (1)ను పెవిలియన్ చేర్చి ప్రత్యర్థిని గట్టిదెబ్బ కొట్టాడు. హర్షిత్ బౌలింగ్‌లో ఓ బంతిని అడ్డంగా ఆడబోయిన డికాక్ ఎల్బీగా ఔటయ్యాడు. తన తర్వాతి ఓవర్లో బ్రెవిస్ (2)ను ఔట్ చేసి మరో వికెట్ ఖాతాలో వేసుకున్నాడు హర్షిత్. ఈ స్థితిలో కెప్టెన్ మార్‌క్రమ్ కాస్త ధాటిగా ఆడే ప్రయత్నం చేశాడు. హర్షిత్ వేసిన ఇన్నింగ్స్ అయిదో ఓవర్లో అతడు రెండు ఫోర్లు కొట్టడంతో స్కోరు కాస్త కదిలింది. పవర్ ప్లే ఆఖరికి దక్షిణాఫ్రికా 23/3తో నిలిచింది. ఆ తర్వాత సఫారీ జట్టు మళ్లీ తడబడింది. స్టబ్స్ (9), బోష్ (4) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. 11 ఓవర్లకు 48/5తో దక్షిణాఫ్రికా కష్టాల్లో పడింది. ఈ స్థితిలో మార్‌క్రమ్, ఫెరీరా (20) వికెట్ల పతనం ఆపడంతో పాటు పరుగులు రాబట్టారు. ముఖ్యంగా ఫెరీరా దూకుడుగా ఆడడంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ కాస్త వేగాన్ని అందుకుంది. కానీ ఫెరీరాను బౌల్డ్ చేసిన వరుణ్ ఈ జోడీని విడగొట్టాడు. ఆ తర్వాత యాన్సెన్ (2) కూడా కూడా వరుణే ఔట్ చేశాడు. మార్‌క్రమ్ మాత్రం పోరాటం ఆపలేదు. హర్షిత్ వేసిన 18వ ఓవర్లో రెండు సిక్స్‌లు, ఫోర్ బాదేశాడు. అతను 41 బంతుల్లో అర్ధసెంచరీ అందుకున్నాడు. మార్‌క్రమ్‌ను అర్ష్‌దీప్ ఔట్ చేయడంతో ఓ మోస్తరు స్కోరు చేయాలన్న దక్షిణాఫ్రికా ఆశలు ఆవిరయ్యాయి. 120లోపే ఆ జట్టు ఇన్నింగ్స్ ముగిసిపోయింది. 20వ ఓవర్లో కుల్‌దీప్ రెండు వికెట్లు తీసి దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

## స్క్వాష్ ప్రపంచకప్ విజేత భారత్



చెన్నై: భారత స్క్వాష్ జట్టు చరిత్ర సృష్టించింది. స్క్వాష్ ప్రపంచకప్‌ను సొంతం చేసుకున్న తొలి ఆసియా జట్టుగా రికార్డులకెక్కింది. చెన్నైలో ఆదివారం జరిగిన ఫైనల్లో భారత్ 3-0తో హాంకాంగ్‌పై ఘనవిజయం సాధించింది. మహిళల సింగిల్స్‌లో సీనియర్ క్రీడాకారిణి జోష్న చిన్నప్ప 3-1 (7-3, 7-5, 7-1)తో లీ కాయిని ఓడించి భారత్‌కు శుభారంభం అందించగా.. అభయ్ సింగ్ పురుషుల సింగిల్స్‌లో 3-0 (7-1, 7-4, 7-4)తో అలెక్స్ లవును చిత్తు చేశాడు. రెండో మహిళల సింగిల్స్ అనాహత్ సింగ్ 3-0 (7-2, 7-3, 7-5)తో టమోటో హోను ఓడించడంతో భారత్ విజయం పూర్తయింది. చివరి మ్యాచ్‌లో వేలవన్ సెంథిల్ కుమార్ బరిలోకి దిగాల్సిన అవసరం లేకపోయింది. భారత బృందం క్వార్టర్స్‌లో దక్షిణాఫ్రికాను, సెమీ-స్‌లో ఈజిప్ట్‌ను ఓడించింది. ఇప్పటిదాకా 2023లో మూడో స్థానంలో నిలవడమే భారత్‌కు టోర్నీలో ఉత్తమ ప్రదర్శన.

## భారత్ చేతిలో పాక్ చిత్తు

### అండర్-19 ఆసియా కప్




**దుబాయ్:** క్రికెట్లో ఏ స్థాయి టోర్నీ అయినా పాకిస్థాన్‌పై భారత్ ఆధిపత్యం కొనసాగుతోంది. కనిష్క్ చౌహాన్ ఆల్‌రౌండ్ ప్రదర్శన, ఆరోన్ జార్జి మెరుపులతో ఆదివారం అండర్-19 వన్డే ఆసియాకప్ గ్రూప్-ఎ మ్యాచ్‌లో భారత్ 90 పరుగుల తేడాతో పాక్‌ను చిత్తు చేసింది. మొదట భారత్ 46.1 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌటైంది. ఆరోన్ (85, 88 బంతుల్లో 12x4, 1x6) టాప్ స్కోరర్. ఛేదనలో దీపేశ్ దేవేంద్రన్ (3/16), కనిష్క్ (3/33), కృష్ణన్ సింగ్ (2/33) ధాటికి పాక్ 41.2 ఓవర్లలో 150 పరుగులకే కుప్పకూలింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురు దెబ్బ తగిలింది. సూపర్ ఫామ్‌లో ఉన్న వైభవ్ సూర్యవంశీ (5) ఎక్కువసేపు నిలవలేదు. ఈ స్థితిలో ఆరోన్ జార్జి, కెప్టెన్ ఆయుష్ మాత్రే (38) ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. మాత్రే వెనుదిరిగినా.. ఆరోన్ నిలవడంతో భారత్ ఒక దశలో 173/4తో బలమైన స్థితిలో కనిపించింది. కానీ 67 పరుగుల తేడాతో 7 వికెట్లు చేజార్చుకుని భారీ స్కోరు చేసే అవకాశాన్ని కోల్పోయింది. కనిష్క్ చౌహాన్ (46), అభిజ్ఞాన్ కుందు (22) రాణించడంతో భారత్ పోరాడే స్కోరు చేయగలిగింది. ప్రత్యర్థి బౌలర్లలో సయ్యమ్ (3/67), సుభాన్ (3/52) సత్తా చాటారు. ఛేదనలో భారత బౌలర్ల ధాటికి.. పాక్ ఏమాత్రం నిలవలేకపోయింది. 21/0తో బాగానే ఆరంభించిన ఆ జట్టు.. తర్వాత క్రమం తప్పకుండా వికెట్లు చేజార్చుకుంది. 77/5తో ఓటమిని ఖాయం చేసుకుంది. హుజైఫా (70, 83 బంతుల్లో 9x4, 2x6) పోరాటం సరిపోలేదు. అతడు కాకుండా ఫర్హాన్ (23), ఉస్మాన్ ఖాన్ (16) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. ఈ టోర్నీలో భారత్‌కు ఇది వరుసగా రెండో విజయం. పాకిస్థాన్ ఆటగాళ్లతో కరచాలనం చేయకూడదనే విధానాన్ని భారత్ ఈ మ్యాచ్‌లోనూ కొనసాగించింది. టాస్ సమయంలో భారత కెప్టెన్ ఆయుష్, పాక్ కెప్టెన్ ఫర్హాన్ ఒకరినొకరు పలకరించుకోలేదు. కరచాలనం కూడా చేయలేదు. మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా ఆటగాళ్లు షేక్ హ్యాండ్ ఇచ్చుకోలేదు.

PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com